నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
సోమవారం | ఏప్రిల్ 22, 2024 | www.navatelangana.com

సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జన్మదిన, వివాహ వార్షికోత్సవ సందర్భంగా సామాజిక బాధ్యతగా రక్తదానం చేయాలని రిమ్స్ డైరెక్టర్ డా. జై సింగ్ రాథోడ్ సూచించారు. ఆదివారం రిమ్స్ ఆస్పత్రిలో భద్రత సిబ్బందిగా పనిచేసే నరేష్ తన జన్మదిన సందర్భంగా రక్త నిధి కేంద్రంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జై సింగ్, ప్రముఖ వైద్యుడు శ్యాం ప్రసాద్‌తో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

తాగునీరు లేక ప్రయాణికులకు ఇబ్బందులు

నవతెలంగాణ-నేరడిగొండ



నేషనల్ హైవే నెం.44 రహదారిపై ఉన్న బస్టాప్‌ల వద్ద సంబంధిత హైవే అథారిటీ వారు ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాప్‌ల వద్ద తాగునీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగనే ఉన్నప్పటికీ వాటి నిర్వహణ మాత్రం చేయడం లేదు. ఆ మంచినీటి ట్యాంకుల్లో తాగునీటిని నింపడం లేదు. దీంతో అక్కడ బస్టాప్‌ల వద్ద నిల్చునే ప్రయాణికులకు దప్పిగా ఉన్నప్పటికీ అక్కడ తాగునీరు అందుబాటులో ఉండటం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు బస్టాప్‌ల వద్ద ఉన్న తాగునీటి ట్యాంకు పరిశీలించి, ప్రయాణికులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.

సన్నాహక సమావేశాలు.. సమీకరణలు..!

▸ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో మొదలైన ప్రచారం ▸ చెన్నూర్ నియోజకవర్గంలో ఎన్నికల సందడి ▸ ఎండను లెక్కచేయకుండా పర్యటిస్తున మఖ్యనాయకులు

నవతెలంగాణ-జైపూర్

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఆయా పార్టీలు ఒక వైపు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తుంటే.. మరో వైపు రాజకీయ సమీకరణాలు కొనసాగుతున్నాయి. ఎంపీ స్థానానికి పోటీ పడుతున్న ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు చెన్నూర్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా గ్రామ పంచాయతీల వారిగా పర్యటిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. ప్రచారంతో పాటు పార్టీ ముఖ్యులతో ఎప్పటికప్పుడు సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్‌లో చేరికలు భారీగా కొనసాగుతుండగా బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు తమ క్యాడర్‌తో కలిసి ఓటర్లను నమ్ముకుని ప్రచారం చేస్తున్నారు..

తండ్రులతో కలిసి కాక వారసునిగా కొనసాగుతున్న తనయుని ప్రచారం

మాజీ ఎంపీ సీడ్ల్యూసీ సభ్యుడు కాంగ్రెస్ కురవృద్ధుడు కాక వెంకటస్వామి వారసునిగా పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణ తనదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యేలతో పలుమార్లు సమావేశమైన ఆయన వ్యక్తిగతంగా ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పర్యటిస్తూ ప్రచారం కొనసాగిస్తున్నారు. వంశీకృష్ణకు మద్దతుగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ నియోజకవర్గంలో ప్రచారం చేస్తుండగా వంశీకృష్ణ తండ్రి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రచారంలో దూసుకుపోతున్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో మరో పార్టీకి అవకాశం లేకుండా నాయకులను కార్యకర్తలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు ముఖ్య నాయకులతో సమిక్షా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. వంశీకృష్ణ తాత వెంకటస్వామి వారసునిగా తనకు అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థిస్తునారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కలిసిన ఎస్సీ సామాజికవర్గంలో గల 57 ఉప కులాల నాయకులు వంశీకృష్ణ గెలుపుకు కృషి చేస్తామని ప్రకటించారు. మొదట్లో కొంత స్తబ్దగా కొనసాగిన కాంగ్రెస్ ప్రచారం ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రచారం ముమ్మరం చేసింది. కాక వారసులుగా గత అనుబందాలను ఏకం చేసుకుంటు ఏ పార్టీకి అవకాశం ఇవ్వకుండా ఉండాలని భారీ సంఖ్యలో వివిధ పార్టీలకు చెందిన నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు.

బీఆర్ఎస్ గెలుపుకు బాల్క సుమన్ క్యాడర్ కృషి

అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్ నుంచి ఓటమి చెందిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా తన క్యాడర్‌ను ప్రచారంలోకి దించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి నియోజకవర్గం పరిధిలో మందమర్రి, రామకృష్ణాపూర్ పట్టణాల్లో ముఖ్య నాయకులతో పలుమార్లు సమావేశమయ్యారు. పెద్దపల్లిలో నామినేషన్ వేసిన కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఇటీవల నిర్వహించి రోడ్డు షోలో తనదైన శైలిలో ప్రసంగిస్తూ కాంగ్రెస్‌ను ఎండగట్టారు. రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ అవకాశం వచ్చిన ప్రతి చోట కాంగ్రెస్ టార్గెట్‌గా ప్రసంగిస్తూ ఓటర్లను బీఆర్ఎస్ తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. చెన్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ప్రచారం ముమ్మరం చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ స్థానిక మాజీ ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్నారు.

బీజేపీ సానుభూతి ఓట్ల కోసం ఆరాటం

భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా పోటి చేస్తున్న గోమాస శ్రీనివాస్ బీజేపీ సానుభూతి ఓటుతో పార్లమెంట్‌లో గెలుపు సాధించాలని ఆరాటపడు తున్నాడు. నేతకాని సామాజికవర్గానికి చెందిన గోమాస శ్రీనివాస్ నేతకాని మహార్‌కుల హక్కుల సంఘం ద్వార తన సామాజికవర్గం ఓట్లు తనకు మాత్రమే అన్నట్లుగా కుల సంఘ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు. చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో నేతకాని సామాజిక వర్గం ఓటు బ్యాంకు అత్యధికంగా ఉండటంతో ఓట్లు చీలిపోకుండా తనకు మాత్రమే వేయాలన్నట్లుగా కుల సంఘాల నాయకులతో సంప్రదింపులు జరుతున్నట్లు తెలుస్తోంది. ఒక వైపు తన సామాజికవర్గం ఓట్లు మరో వైపు బీజేపీ సానుభూతి ఓట్లు ఆశిస్తూ ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు వెర్రబెల్లి రఘునాథ్ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జిల్లా పరిధిలో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం మ్మురం చేశారు. ఇటీవల భీమారం మండలంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన ఇతర పార్టీలకు చెందిన పలువురితో పాటు తటస్థులను బీజేపీలో చేర్చుకుని ఇంటింట ప్రచారం చేశారు.



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా పెద్దపల్లిలో మాట్లాడుతున్న బాల్క సుమన్



ఓట్లు అభ్యర్థిస్తున్న గోమాస శ్రీనివాస్

అకాల వర్షం... అపార నష్టం

- నెలకొరిగిన జొన్న, నువ్వు పంటలు
- విద్యుత్ సరఫరాలో అంతరాయం



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని ఆయా గ్రామంలో గత మూడు, నాలుగు రోజుల నుంచి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలతో కూడిన భారీ అకాల వర్షం కురిసింది. మండల కేంద్రమైన కుభీర్, పార్డి(బి), పల్సి, బెల్గాం తదితర గ్రామాల్లో జొన్న, నువ్వు పంటలు నేలకొరిగాయి. కల్లాల ఎదుట విక్రయించటానికి సిద్దంగా ఉన్న మొక్కజొన్న, జొన్న పంటలు తడిసి ముద్దయ్యాయి. కుభీర్‌లోని బెల్గాం గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డుపై చెట్టు విరిగిపోవడంతో వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా ఆయా గ్రామంలో పంటలతో పాటు ఇంటి పైకప్పులు ఎగిరిపోయాయి. దీంతో పాటు గత మూడు రోజుల నుంచి ఆయా గ్రామాల్లో ఈదురుగాలులతో విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అదే విధంగా ఆయా గ్రామాల్లో ఉన్న రైతులకు సంబంధించిన పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు పూర్తిగా నష్టపోయారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలన్నారు.

టాటా ఏసీ, బొలెరో ఢీకొని పలువురికి గాయాలు



నవతెలంగాణ-తలమడుగు


మండలంలోని సుంకిడి గ్రామ పెట్రోల్ పంపు సమీపంలో ఆదివారం తెల్లవారు జామున టాటా ఏసీ బొలోరో వాహనం ఎదురెదురుగ ఢీకొన్న సంఘటనలో పలువురు గాయలైనట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర నాందేడ్ జిల్లా నవేగాం గ్రామానికి చెందిన 16 మంది టాటా ఏసీ ఎమ్ హెచ్ 26 బీఈ 7815 వాహనంలో మహారాష్ట్ర చంద్రపూర్ మహంకాళి దర్శనానికి వెళ్తున్నారు. అదిలాబాద్ జిల్లా కేంద్రం నుండి బొలెరో మ్యాక్స్ పికప్ వాహనం ఎమ్‌హెచ్ 30 ఏబి 1252 వాహనం ఎదురుగ రావడంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. టాటా ఏసీ డ్రైవర్ గాదె పాండురంగ్ జాగ్రత్తగా, అతివేగంగా వాహనం నడపడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. టాటా ఏసీలో ప్రయాణిస్తున్న 16 మందిలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా 8 మందికి స్వల్ప గాయాలు అయినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

నేటి సీఎం సభకు భారీగా తరలిరావాలి

నవతెలంగాణ-నార్నూర్

జిల్లా కేంద్రంలో నిర్వహించే సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతున్నారని, సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు కె విశ్వప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎం సభను విజయవంతం చేయాలని, గడపగడపకు వెళ్లి ప్రచారం చేసి ఎంపీ అభ్యర్థి సుగుణను గెలిపించే దిశగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి గజనంద్ నాయక్, మండల అధ్యక్షుడు దేవరావ్ లోఖండే, మాజీ జడ్పీటీసీ బ్రిజులాల్, కో అప్షన్ మెంబర్ షేక్ దస్తగిర్, నాయకులు దుర్గే కాంతారావ్, దాదే అలీ, నర్సింగ్ మోరే, కరీం ఖాన్, మహేందర్, యూసుఫ్ ఖాన్, డిగంబర్, జాకీరుల్లా ఖాన్, యునూస్ ఖాన్, యూత్ సభ్యులు షేక్ నసీర్ ఉన్నారు.

ప్రశాంతంగా టీఎస్ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ కళాశాల(టీఎస్ఆర్‌జేసీ)లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకు పరీక్ష కొనసాగింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా పరీక్ష కేంద్రాలను సౌకర్యాలు కల్పించారు. 5,506 మంది దరాఖాస్తులు చేసుకోగా వీరి కోసం జిల్లా కేంద్రంలో 23 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో విద్యార్థులను తనిఖీ చేసిన అనంతరం లోనికి అనుమతించారు. ఈ పరీక్షకు 4437 మంది హాజరు కాగా 1069 మంది గైర్హాజరైనట్లు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ గంగాశంకర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో రెండు టీఎస్ఆర్‌జేసీ కళాశాలున్నాయని, నిర్మల్ బాలికలో 88 సీట్లు, బెల్లంపల్లి బాలుర కళాశాలలో 88 సీట్లు ఉన్నాయన్నారు. త్వరలో పరీక్ష ఫలితాలు ప్రకటించి సీట్లు కేటాయిస్తామన్నారు. సుదూర ప్రాంతాల నుండి విద్యార్థులు వారి తల్లిదండ్రులు వచ్చారు. పరీక్ష ముగిసేవరకు విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాల వద్దే చెట్ల కింద, షెటర్స్ కింద నీడను చూసుకొని పరీక్ష అయ్యేవరకు సేద తీరారు. పరీక్ష ముగిశాక తిరుగు ప్రయణానికై బస్టాండ్‌కు చేరుకున్నారు. ఒక్కసారిగా వెళ్లడంతో బస్టాండ్ ప్రాంగణామంత రద్దీగా మారింది. బస్సులో సీటు దొరకకపోవడంతో నిరీక్షించారు.

అభివృద్ధి చేస్తాం.. ఎంపీని గెలిపించాలి

- ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి సీతక్క

నవతెలంగాణ-ముధోల్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లో ఏర్పాటు చేసిన మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పేదింటి ఆదివాసీ ఆడబిడ్డ ఆత్రం సుగుణను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చినా ఆరు గ్యారంటీలను అన్ని నెరవేర్చి తీరుతుందని అన్నారు. రైతులకు ఆగస్టులో రూ. 2లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారని అన్నారు. పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ పేదింటి హక్కుల కార్యకర్తగా పేద ప్రజల మేలు కోరే వ్యక్తి అని అన్నారు. అధిక మెజార్టీతో గెలిపిస్తే అగ్రగామిగా ఆదిలాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు. కేంద్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని అన్నారు. బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని విమర్శించారు. పదేండ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సామాన్య ప్రజల కోసం చేసిన మంచి పని ఎమన్నా ఉందా అని ప్రశ్నించారు. బీజేపీ హయాంలో కేవలం ఆధాని, అంబానిలు అభివృద్ధి చెందారని అన్నారు. రైతులు, సామాన్య ప్రజలు అభివృద్ధి చెందలేదని ఆరోపించారు. రాష్ట్రంలో పది సంవత్సరాలు బీఆర్ ఎస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రం అభివృద్ధి చెందలేదన్నారు. బీజేపీ హయాంలో పెరిగిన ధరలతో సామాన్యుడు రగిలిపోయాడని పేర్కొన్నారు. కేంద్రంలో పది సంవత్సరాలు బీజేపీ ప్రభుత్వం ఉన్న జిల్లాలో సిమెంట్ ఫ్యాక్టరీ తెరువ లేదన్నా రు. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్‌కు రైల్వేలైన్ వేయలేదన్నారు. బాసరలో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయలేదని విమర్శించారు. జీఎస్టీ పెంచి పేదవారికి ఇబ్బందులు పెట్టిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయితే అన్ని సమస్యలు తీరుతాయని అన్నారు. మే13 న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డి, రేఖానాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రేమ్ నాథ్‌రెడ్డి, గంగారెడ్డి, అజీజ్, ఖాలీద్ పటేల్, దిగంబర్, అఫ్రోజ్ ఖాన్, ఎజాజోద్దీన్, అనిల్, రాంరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసుల అభివృద్ధికి జన్‌మన్ యోజన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసులు, గిరిజనులను ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివాసుల అభివృద్ధికి జన్‌మన్ యోజన పథకాన్ని తీసుకువచ్చి వేల కోట్లు కేటాయించారని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. నార్నూర్, గాదిగూడకు చెందిన ఆదివాసులు, సార్మేడి, పటేళ్ల ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన ఇప్పటి వరకు ఆదివాసుల గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. తన పదేండ్ల పాలనలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివాసులతో పాటు వెనకబడిన ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడానికి జన్‌మన్ యోజన పథకాన్ని తీసుకువచ్చారన్నారు. మూడో సారి కూడా ప్రధాని నరేంద్ర మోడీ కావాలంటే ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్ ముస్తాపురే, రాజన్న, భూమన్న, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు సీఎం రేవంత్‌రెడ్డి రాక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 22న జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం సభా ఏర్పాట్లను పరిశీలించారు. పలు సూచనలు చేసి సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రధాన వేదిక, జనం ప్రవేశించే మార్గాలు తదితర విషయాలను నిర్వాహకులను ఆయన అడిగి తెలుసుకున్నారు. బహిరంగ సభ విజయవంతం అయ్యేలా ముఖ్య నాయకులకు పలు సూచనలు చేశారు. జిల్లా చరిత్రలో మొట్ట మొదటిసారిగా ఒక మహిళకు, ఆదివాసీ బిడ్డకు కాంగ్రెస్ పార్టీ ఎంపీ సీటును కేటాయించిందని అన్నారు. మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న ప్రాధాన్యత తెలుస్తోందని అన్నారు. సామాన్య పేద కుటుంబానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి ఎలాంటి రాజకీయ వారసత్వం లేదని వెల్లడించారు. అలాంటి సాధారణ వ్యక్తి చట్టసభలకు వెళితే సామాన్యుల పక్షాన గొంతుకగా మారి తన వాణి వినిపిస్తుందని అన్నారు. ఎన్నికల్లో ఆత్రం సుగుణను గెలిపించి అధిష్టానానికి బహుమతిగా ఇవ్వాలన్నారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు రషీద్ ఉల్ హక్, జాఫర్ అహ్మద్, మాజీ జెడ్పీటీసీ కొండ గంగాధర్, పిప్పర్‌వాడ ఎంపీటీసీ ప్రశాంత్‌రెడ్డి, ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కొండూరి రవి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, డేరా కృష్ణ రెడ్డి, రాజా లింగన్న, అల్లూరి భూమారెడ్డి, దర్శనాల అశోక్, ఖయ్యుమ్, రఫీక్, షాకీర్, అతిక్ ఉర్ రెహమాన్, షేక్ మన్సూర్, బూరే సురేష్, దూపే శంకర్, ఇర్ఫాన్ ఖాన్, సమీ ఉల్లా ఖాన్, కర్మ, అఖీమ్, రహీమ్ ఖాన్ ఉన్నారు.

రేవంత్ రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేయాలి

- మాజీ మంత్రి జోగు రామన్న



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ రూ.2 లక్షలు ఇవ్వలేకపోతే సీఎం పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి జోగురామన్న రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. అలాగే అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వాలని, హామీల అమలులో ఘోరంగా విఫలమైన కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గతంలో ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ వాటిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా, రూ. రెండు లక్షల రుణమాఫీ, రూ.4వేల పెన్షన్ తదితర హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం బుట్టదాఖలు చేస్తోందని మండిపడ్డారు. బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తోందని ఆక్షేపించారు. సోనియా గాంధీ జన్మదినం రోజునే రుణమాఫీ చేస్తానని గతంలో ప్రకటించిన ముఖ్యమంత్రి ప్రస్తుతం ఆగస్టు 15వ తేదిన రుణమాఫీ చేస్తానంటూ దేవుళ్లపై ప్రమాణం చేయడం విడ్డూరమన్నారు. ఆగస్టు పదిహేనవ తేదిన కూడా రుణమాఫీ చేయకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. కళ్యాణ లక్ష్మి నగదుతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ ప్రతి రోజు అబద్ధాలతో పబ్బం గడుపుతోందని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుస్తుందన్న భయంతోనే సిఎం రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్‌కు ఎనిమిది సార్లు ప్రచారానికి వెళ్ళారని, స్వంత పార్టీ కార్యకర్తలే హామీల గురించి వారిని ప్రశ్నిస్తున్నారన్నారు. దేశంలోనే అత్యంత ఎత్తైన అంబేద్కర్ విగ్రహం వద్ద కనీసం నివాళి అర్పించకుండా గేట్లకు తాళం వేయడంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంద్రవేల్లిలో ఆదివాసులను తూటాలతో కాల్చిన చరిత్ర గత కాంగ్రెస్ ప్రభుత్వానిదని ప్రస్తుత మంత్రులు మాత్రం నివాళి అర్పిస్తూ కపట ప్రేమ చూపుతున్నారన్నారు. స్తూపాన్ని తాకే నైతిక హక్కు కూడా వారికి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఆదివాసీలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్తారన్నారు. ప్రాంతీయ పార్టీల అభ్యర్థులే స్థానికంగా నెలకొన్న సమస్యలను పార్లమెంట్ దృష్టికి తీసుకేళ్తామన్నారు. తెలంగాణ గొంతుక పార్లమెంట్‌లో వినబడాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యమని పునరుద్ఘాటించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, సెవ్వ జగదీష్, సాజిదోద్దీన్, కొడప సోనేరావు, ధమ్మపాల్, కొండ గణేష్, విజ్జగిరి నారాయణ, సంద నర్సింగ్, సంజయ్, భూమన్న, స్వాగత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని పాత ఉట్నూర్ మాజీ మంత్రి కొట్నాక్ భీంరావ్ కుమారుడు కొట్నాక్ సుధాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదివారం వారి ఇంటికీ వెళ్లి అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యూమ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇక్బాల్, కాంగ్రెస్ నాయకుడు ఒమేశ్వర్, అజీమ్, సామాజిక కార్యకర్త జైవంత్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీటీసీ, మాజీ సర్పంచ్

నవతెలంగాణ-కడెం



ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కడెం జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డితో పాటు లక్ష్మీపూర్ గ్రామ మాజీ సర్పంచ్ విజయ్, రాజన్న కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్, నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెంకటేష్, మాజీ సర్పంచ్ లచ్చన్న, సీనియర్ నాయకులు పడిగెల భూషణ్, రాజేశ్వర్ రెడ్డి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

అందని సాగునీరు.. ఎండుతున్న పంటలు

- నీరందించని డి-28 కెనాల్
- అధికారులు నీటిని విడుదల చేయాలి
- మూడు తడులు సాగు నీరందించాలని అన్నదాతల వేడుకోలు

ఆరుగాలం కష్టపడి నాట్లు వేసిన అన్నదాతకు అన్ని కష్టాలే, వేసిన పంటలకు నీరందక కండ్ల ముందు పంటలు ఎండిపోతుంటే రైతు తన బాధను గుండెల్లో దిగమింగి, పంటలకు నీరందించాలని డి-28 కెనాల్‌కు మరమ్మతులు సైతం రైతులే చేసుకున్నప్పటికీ అధికారులు సాగు నీరందించక పంటలు కండ్లముందే ఎండి పోతుంటే రైతు దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నట్లు రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.



డి-28 కెనాల్ రాకపోవడంతో ఎండిపోయిన చెరువు



సాగునీరందకపోవడంతో ఎండిపోయిన వరి పంట

నవతెలంగాణ-పెంబి

మండలంలోని మందపల్లి కొత్త చెరువుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి డి-28 కెనాల్ ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరందుతుంది. ప్రతి సంవత్సరం ఆయకట్టు కింద వందల ఎకరాలు సాగవుతున్నాయి.దీంతో రైతులు వరి నాట్లు వేశారు. ప్రస్తుతం వరి పంట పొట్టదశలో ఉంది. ప్రస్తుతం చెరువులో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. డి-28 కెనాల్ ద్వారా చెరువుకు రావాల్సిన నీటిని అధికారులు విడుదల చేయడం లేదని రైతు ఆరోపిస్తున్నారు. పంటలు పొట్టదశలో సాగునీరు ఇవ్వాల్సి ఉంటుంది. లేకపోతే పంటలు దిగుబడి రాకపోవడంతోపాటు ఎండి పోతున్నాయని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఖానాపూర్ మండలంలోని సింగపూర్ గ్రామం వద్ద డి-28 కెనాల్ కాలువ తెగి ప్రవాహం నిలిచిపోవడంతో కొత్త చెరువు ఎండుకోపోయింది. కాలువ మరమ్మతులు చేపట్టాలని అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. తమ వరి పంట కాపాడుకునేందుకు ఆయకట్టు రైతులు శ్రమించి తెగిన కాల్వకు మరమ్మతులు చెపట్టారు. అయిన రైతు శ్రమకు ఫలితం లేకుండా పోయింది. డి-28 కెనాల్ ద్వారా వచ్చిన నీటిని చెరువు నిలుపుదల చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటకు మూడు తడులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ సాగు డి-28 సాగునీరు రాక పంటలకు తడులు ఇవ్వలేకపోతున్నామని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు నీటిని విడుదల చేసి చెరువు నింపితేనే పంటలు వస్తాయని లేకుంటే పంటలు ఎండిపోయి నష్టాలను చవిచూడాల్సి వస్తుందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖాధికారులు సాగునీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

సాగునీరందించాలి



యాసంగి సాగు నీరు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో కొత్త చెరువు ఆయకట్టు కింద రెండు ఎకరాలు వరి వేశాను. డి-28 కాలువ తెగిపోవడంతో రైతులు కలిసి మరమ్మతులు కూడా చెపట్టాం. అయినప్పటికి కూడా కాలువ ద్వారా నీరు రావడం లేదు చివరి తడికి నీరు అందక వరి పంట ఎండిపోతుంది. వెంటనే అధికారులు నీరందించాలని కోరుతున్నా.

బైరెడ్డి రాజేందర్, రైతు, మందపల్లి

కొరవడిన పారిశుధ్యం

- పట్టించుకోని పంచాయతీ అధికారులు



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో పారిశుధ్యం కొరవడింది. గ్రామపంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేక ఎక్కడి మురుగు కాలువలు అక్కడే చెత్తతో నిండి దుర్వసనను వెదజల్లుతున్నాయి. పంచాయతీ కార్మికులు మురుగు కాలువల్లోని చెత్తను తీసిన పూర్తి స్థాయిలో తీయడం లేదని గ్రామస్తులు పలువురు ఆరోపిస్తున్నారు. పూర్తిస్థాయిలో మురుగు కాలువలు శుభ్రం చేయని కారణంగా అవి తొందరగానే నిండిపోయి, దుర్గంధం వెదజల్లుతుంది. అదేవిధంగా దోమలు వ్యాప్తి చెందడంతో ప్రజలు ఆనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీఎం సభకు భారీగా తరలి రావాలి

- ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు కె విశ్వప్రసాద్



నవతెలంగాణ-నార్నూర్

జిల్లా కేంద్రంలో తలపెట్టిన సీఎం సభకు పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా తరలి రావాలని కాంగ్రెస్ ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కె విశ్వప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాజీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి గజనంద్ నాయక్ పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎం సభను విజయవంతం చేయాలని, గడప గడపకు వెళ్లి ప్రచారం చేసి ఎంపీ అభ్యర్థి సుగుణను గెలిపించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దేవరావ్ లోఖండే, మాజీ జెడ్పీటీసీ బ్రిజులాల్, కోఆప్షన్ మెంబర్ షేక్ దస్తగిర్, నాయకులు దుర్గే కాంతారావ్, దాదే అలీ, నర్సింగ్ మోరే, కరీం ఖాన్, మహేందర్, యూసుఫ్‌ఖాన్, డిగాంబర్, జాకీరుల్లా ఖాన్, యునుస్ ఖాన్, కాంగ్రెస్ యూత్ సభ్యులు షేక్ నసీర్ ఉన్నారు.

ఉచిత ఆయుర్వేద హెల్త్ క్యాంప్



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌లో ఆదివారం ఉచిత ఆయుర్వేద హెల్త్ క్యాంపును నిర్వహించారు. ప్రముఖులు ఎండి అలీముద్దీన్ తల్లి జ్ఞాపకార్థం ఈ సేవ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ప్రజలందరికీ ఉచిత ఆయుర్వేద మందులు అందించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యులు రాము, అఫ్రోజ్ మీర్జ, ఇమ్రాన్, శేఖర్, దిలీప్, ప్రదీప్ పాల్గొన్నారు.

బీజేపీ ఓటమే లక్ష్యంగా పని చేయాలి

నవతెలంగాణ-నిర్మల్



బహిరంగ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య

బీజేపీ ఓటమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య అన్నారు. ఆదివారం నిర్మల్ సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హీరా ఫంక్షన్ హాల్లో ఎన్నికల బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 10ఏండ్ల కాలంలో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారని అన్నారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలను మార్చి మనుస్మృతిని అమలు చేయాలనీ బీజేపీ చూస్తుందని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్న బీజేపీని ఓడించడం ప్రజల ముందున్న కర్తవ్యమని అన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నా హామీ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. దేశ ప్రజల అకౌంట్‌లలో నల్లధనం రూ.15 లక్షలు వేస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేశారని అన్నారు. ప్రజల మధ్య మత వైషమ్యాలు సృష్టించి ఓట్లు పొందాలని చూస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని అన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిని జైళ్లల్లో పెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, బొమ్మెన సురేష్, సుజాత, జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, తొడసం శంభు, ఇప్ప లక్షణ్, నిర్మల్ పట్టణ కార్యదర్శి ఫసియుద్దిన్, నాయకులు నాగెల్లి నర్సయ్య, పోశెట్టి, వెస్లీ, నవీన్, ముత్తన్న పాల్గొన్నారు.

అధికార కాంగ్రెస్ పార్టీని ఆదరించాలి



నవతెలంగాణ-బోథ్

మారుమూల ప్రాంతాల అభివృద్ధి జరగాలంటే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ నాయకులు ఆత్రం భాస్కర్ అన్నారు. మండలంలోని నాగపూర్, జైనూరుపల్లె, నిగిని, కంతేగాం, బాబేర, నేరేడుపల్లె, చింతగూడ, గురుదేవ్ నగర్, జీడిపల్లి, డివిటి, పరుపులపల్లెలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో పాటు అటవీ హక్కుల చట్టం గ్రామీణ ఉపాధి హామీ చట్టం, పెసా చట్టం కాలరాస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వస్తేనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఇండ్ల నిర్మాణం, కొత్త రేషన్ కార్డులు, గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, గ్రామ పటేన్లు, మహిళలు, యువకులు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని న్యూహౌజింగ్ కాలనీలో గల శ్రీరమ సహిత సత్యనారాయణ స్వామి ఆలయ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా స్థానిక కౌన్సిలర్ పవన్ నాయక్, ఉపాధ్యక్షుడిగా విజయరావు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా కె. రాములు, గౌరవ అధ్యక్షులుగా జి.రాములు, కోశాధికారిగా భగవన్లు, సంయుక్త కార్యదర్శిగా ప్రకాష్ రాథోడ్, సభ్యులుగా మనోజ్ రెడ్డి, అడే శేఖర్, బండారి సతీష్, బండారి మనోహర్‌లను ఎన్నుకున్నారు. మూడోసారి అధ్యక్షుడిగా నియామకమైన పవన్ నాయక్‌ను పలువురు సత్కరించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

మేడేను పార్టీతో పాటు అనుబంధ సంఘాలు నిర్వహించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎనిమిది గంటల పని దినం కావాలని 1 మే 1886లో అమెరికాలోని చికాగోలో కార్మికులు పోరాడి అమరలయ్యారని, వారి త్యాగాలను స్మరించుకుంటు మేడేను పార్టీతో పాటు అనుబంధ సంఘాలు నిర్వహించుకోవాలని, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మేడే ప్రముఖ్యతను తెలియజేశారు. కార్మికులు అదే రోజు గ్రామగ్రామన జెండాలను ఆవిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1886 కంటే ముందు కార్మికులు 24 గంటల పాటు పని చేశారన్నారు. బానిసలుగా చూస్తు పెత్తందారులు శ్రమకు తగిన ఫలితం కూడా ఇచ్చేవారు కాదన్నారు. 1 మే 1886లో ఎనిమిది గంటల పని దినం కోసం ఉద్యమం ప్రారంభమైందన్నారు. అమెరికా ప్రభుత్వం దీన్ని సహించకుండా కార్మికులపై కాల్పులు జరిపిందన్నారు. రక్తపు మడుగులో షర్టులను ముంచి హక్కులు కావాలని కార్మికులు ప్రాణాలర్పించారన్నారు. అదే ఎర్ర జెండా ఎంతో మందికి అండగా నిలిచిందన్నారు. మే 1న గ్రామ గ్రామన మేడే ఉత్సవాలను జరుపుకుంటు జెండాలను ఆవిష్కరించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు కుంటాల రాములు, అరుణ్ కుమార్, కట్ట కృష్ణస్వామి, సంతోష్, సుభాష్, లచ్చిరాం పాల్గొన్నారు.

ఆత్రం సక్కును గెలిపించాలి

నవతెలంగాణ-ముథోల్

ఆదిలాబాద్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని ఆదిలాబాద్ జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ కోరారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో పెద ప్రజల అభివృద్ధికి పెద్ద పీట వేసిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీతో అభివృద్ధి జరుగదని అన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. ఆయన వెంట ఎంపీటీసీ బండారి గంగాధర్, నాయకులు విఠల్, చిన్నన్న, మారిభా, బాబాసాహెబ్ పాల్గొన్నారు.

గోడం నగేష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిద్దాం

నవతెలంగాణ-నేరడిగొండ

గోడం నగేష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిద్దామని బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. ఆదివారం మండలంలోని తిమ్మాపూర్, లక్ష్మీపూర్, పీచరా, గోవింద్‌పూర్, నాగమల్యాల్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గల్లీలో ఎవరున్నా డిల్లీలో మాత్రం మోడీయే ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సాభ్లే సంతోష్ సింగ్, మాజీ ఎంపీపీ ఆత్రం జ్ఞానసుధ, శక్తి కేంద్ర ఇన్‌చార్జీ గట్టు నారాయణ, ప్రధాన కార్యదర్శులు బంటు ప్రవీణ్, ధర్మపురి రాఘవులు, బీజేవైఎం మండల అధ్యక్షులు బాక్రె లక్ష్మణ్, పోలింగ్ బూత్ అధ్యక్షులు బైరి రాజేందర్, అర్క గంగారాం, చిట్టడి గంగాధర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి. ఆదివారం లక్ష్మణచాంద గ్రామ మాజీ సర్పంచ్ బిట్లింగ్ నారాయణ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన నాయకులు మంగళపల్లి గణేష్, ఎర్ర పోతన్న, లక్ష్మణ్, దాదాపు 50 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిని అధిక మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వొద్దుల రాజేశ్వర్, మాజీ సర్పంచ్ అట్ల రామిరెడ్డి, ఈటెల శ్రీనివాస్, చిన్న రాంరెడ్డి, నరేష్ రెడ్డి, ప్రతాపరెడ్డి, శేఖర్‌రెడ్డి, నర్సయ్య, లింగన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత మాటలు

నవతెలంగాణ-భైంసా

మోసపూరిత హామీలతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల్లోనూ అవే మాటలు చెబుతుందని ప్రజలు వాటిని నమ్మవద్దని ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు మాట మార్చి ఆగస్టులో అమలు చేస్తామని చెప్పడం రైతులను మోసగించడమేనన్నారు. రైతులకు మే, జూన్ నెలల్లోనే పంట పెట్టుబడి అవసరముంటుందని, అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో రుణమాఫీ చేస్తామని చెప్పడం వ్యవసాయంపై ఆయనకున్న అవగాహన అర్థం చేసుకోవచ్చన్నారు. పదేండ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి మనుగడ లేదని జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడుతున్నారన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని, ఇందుకు ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందనను చూస్తే తెలుస్తోందన్నారు. మోడీని మూడోసారి ప్రధాని చేయాలని ప్రజలే సంకల్పించుకున్నారని, ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించుకుని ప్రధానికి కానుకగా ఇస్తామన్నారు.

24న నామినేషన్ ర్యాలీ..

ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ ఈనెల 24న నామినేషన్ వేయనున్నారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు నామినేషన్ ర్యాలీ ప్రారంభమవుతుందని, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్, జిల్లా అధ్యక్షులు అంజుకుమార్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, ఎంపీపీ అబ్దుల్ రజాక్, పట్టణ అధ్యక్షులు మల్లేశ్వర్, సాప్లి రమేశ్ ఉన్నారు.

ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-ఉట్నూర్

ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపుకు మద్దతుగా ఎన్నికల ప్రచార రథాన్ని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ ఆదివారం ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి గెలుపు లక్ష్యంగానే ప్రతి ఒక్కరూ సైనికుల పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ మండలం బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు కందుకూరి రమేష్, మాజీ వైస్ ఎంపీపీ ఎండీ సలీముద్దీన్, సుఫియన్, పుష్పారాణి, దూట మహేందర్, సోనేరావు, కామేరి రాజు, హైమద్ అజ్జు, శ్రీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జెడ్పీటీసీకి సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని రుయ్యాడి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి మాట్లాడుతూ ముదిరాజ్ సంఘానికి అన్ని విధాలుగా అండగా ఉంటూ ప్రభుత్వం తరుపున సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కనీస మౌలిక సదుపాయాలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగల్ విండో చైర్మెన్ ప్రకాష్‌రావు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బైండ్ల గణేష్, ముదిరాజ్ సంఘం పెద్దలు గొనెల గంగన్న, దొంతుల ఇస్తారి, గ్రామస్తులు రమాకాంత్, లోక ప్రవీణ్‌రెడ్డి, గాజుల సంబశివ్, పోశెట్టి, బైండ్ల రామన్న అశోక్, తలకొక్కుల గంగారెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | ఏప్రిల్ 22, 2024 | www.navatelangana.com

మురిపించిన మై మదర్ విద్యార్థులు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని మై మదర్ పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్న 28 మంది విద్యార్థులు ఈ సంవత్సరం గురుకుల పాఠశాల ఐదవ తరగతిలో చేరెందుకు పరీక్ష రాయగా, అందులో 24 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై ప్రభంజనం సృష్టించారు. మై మదర్ పాఠశాల కరస్పాండెంట్ గోమసే తులసిరాంతో పాటు ఉపాధ్యాయులను అధికారులు, మండల నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశంసిస్తూ స్వాగతం పలికారు. అనంతరం కరస్పాండెంట్ తులసిరాం మాట్లాడుతూ రాబోయే కాలంలో విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తూ విద్యార్థుల తల్లిదండ్రులు సహకరిస్తే మరిన్ని అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇప్పటికే ఈ పాఠశాల నుండి నీట్, ఐఐటీ రంగాలలో విద్యార్థులు ఆయా యూనివర్సిటీలలో విద్యాభ్యాసం చేస్తున్నట్లు తెలిపారు.



ఉచిత వైద్య శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

పట్టణంలోని ద్వారకానగర్ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో మంచిర్యాల మైండ్ మ్యాటర్స్ న్యూరో సైకియాట్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మానసిక వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మానసిక వైద్య నిపుణులు డా. రవివర్మ, డా. సాయిలక్ష్మిలు శిబిరానికి వచ్చిన రోగులు, బాధితులకు పరీక్షలు నిర్వహించి సూచనలు అందజేశారు. ఆల్కహాల్, ఇతర మత్తు పదార్థాల వ్యసనం మాన్పించుట, డిప్రెషన్, ఆత్మహత్య ప్రయత్నలు చేసుకోకుండా సూచనలు, ఆందోళన, గుండెల్లో దడ, గుబులు, వివిధ రకాలైన తలనొప్పులు, తనలో తాను నువ్వుకోవటం, మాట్లాడుకోవటం, చిన్న పిల్లలు అతిగా అల్లరి చెయ్యటం, సరిగా చదవలేక పోవటం రాయలేక పోవటం, బుద్ధి మాంద్యం, శీఘ్ర స్ఖలనం, అంగస్తంభన, కోరికలు లేకపోవటం లాంటి సెక్స్ సమస్యలకు పరిష్కారాలు వివరించారు.



మండల కేంద్రంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు భరోసా కల్పించేల ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో ఆదివారం సీఆర్‌పీఎఫ్ భద్రత బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలందరు సహకరించాలని, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అల్లర్లు చెలరేగకుండా ప్రజలంతా పోలీసులకు సహకరించాలన్నారు. ఎవరైన చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలంత ఎలాంటి గొడవలు లేకుండా గ్రామాల్లో ఎన్నికలు శాంతియుతంగా జరిగేల సహకరించాలని, సామరస్యంగా ఉండాలన్నారు. ఏవైనా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద అల్లర్లు జరిగే సమాచారం ఉంటే ముందుగా పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు, పెంచికల్‌పేట్ ఎస్ఐ కొమురయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా హనుమాన్ శోభాయాత్ర




నవతెలంగాణ-ఆసిఫాబాద్

హనుమన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ ప్రధాన వీధుల గుండా నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. ఆలయం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి ఆలయ ప్రధాన అర్చకులు శిరీష్ శర్మ పూజలు చేశారు. స్థానిక శిరిడి సాయి మందిరం వద్ద బీజేపీ నాయకులు, జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు అరిగెల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షులు కె.విశ్వ ప్రసాద్ రావు పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. శోభయాత్ర పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగుతూ ఆలయానికి చేరుకుంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండా వెంకన్న, కోశాధికారి పిన్న వివేక్, కమిటీ ప్రముఖులు రాధాకృష్ణ చారి, ఎకరాల శ్రీనివాస్, వి. మధు, డాక్టర్ రమేష్, ప్రకాష్ గౌడ్, సుధాకర్‌లు శోభాయాత్ర విజయవంతం కోసం ఏర్పాట్లు చేశారు. శోభాయాత్రలో స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి పాల్గొని పూజలు చేశారు. ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు చిలివేరి వెంకన్న, భాజపా నాయకులు విశాల్, కోట వెంకన్న పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని పెసరుగుంట గ్రామానికి చెందిన జుమ్మిడి కిరణ్(27) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. యువకుడు కొంతకాలగా కడుపునొప్పితో బాధపడుతున్నాడన్నారు. ఆస్పత్రులు తిరిగిన వ్యాధి నయం కాకపోవడంతో శనివారం ఉదయం గ్రామ సమీపంలోని పెద్దవాగు వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే అతనిని కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్టు పేర్కొన్నారు. మృతుడి అన్న రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా మహావీర్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో మహావీర జయంతిని పురష్కరించుకుని జైనుల ఆధ్వర్యంలో మహావీర్ జయంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం తేరువీధిలోని జైనుల ఆలయంలో జైనులు, మార్వాడీలు మహావీర్ విగ్రహానితో ఊరేగింపు చేపట్టారు. మహావీరుని తత్వాలు, సిద్ధాంతాలు, శాంతి సందేశాలను వివరించి మహావీర్ విగ్రహాన్ని నగర పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్వాడి సమాజ్ అధ్యక్షులు అజీత్ లోఢ, అడ్వైజర్ పారస్ టాటీయ, వైభవ్ టాటియా, మూల్ చంద్ లోఢా, దర్శన్ లోఢ, మోను లోఢ, నవీన్ లోఢ మార్వాడి సమాజ్ మహిళలు, పిల్లల పాల్గొన్నారు.



హరితహారం మొక్కలు అగ్గిపాలు

- నిప్పు పెట్టడంతో కాలిపోతున్న చెట్లు
- లోపించిన అధికారుల పర్యవేక్షణ

నవతెలంగాణ-దహెగాం

రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించేందుకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన హరితహారం పథకం అధికారుల పర్యవేక్షణ లోపంతో అబాసుపాలవుతుంది. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టంలో భాగంగా జిల్లాలో ప్రతిఏటా పెద్దఎత్తున మొక్కలు నాటారు. నాటిన మొక్కలను పరిరక్షించి పచ్చదనం పెంపొందించడంలో కీలకంగా ఉండాల్సిన అధికారులు వారి పర్యవేక్షణ లోపంతో హరితహారం నిర్వీర్యమవుతుంది. నాటిన మొక్కలు కొంతమంది రైతుల నిర్లక్ష్యం కారణంగా రోడ్ల వెంట ఉన్న పెద్దపెద్ద చెట్లు, చిన్న మొక్కలు కాలిబూడిదవుతున్నాయి. మండల కేంద్రం నుండి కాగజ్‌నగర్‌కు వెళ్లే దారికి ఇరువైపుల రూ.కోట్లు వెచ్చించి మొక్కలు నాటి పెంచారు. కొంతమంది రైతులు పంట పొలాలు చదును చేస్తూ పత్తి కట్టెను హరితహారం మొక్కల క్రింద పెట్టి నిప్పంటించడంతో మొక్కలు ఎక్కడికక్కడ కాలిపోతున్నాయి. బోర్లకుంట, ఇట్యాల, మురళీగూడ, ఐనం, బీబ్రా తదితర గ్రామాల్లో ప్రధాన రోడ్ల వెంట పదుల సంఖ్యలో మొక్కలు కాలిపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో లక్షల రూపాయల నిధులు వృథా అయిపోయాయి.

లక్ష్యం నీరుగారుతున్న హరిత లక్ష్యం...

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు, పంట పొలాలకు వెళ్లే సదర్ రోడ్లకు ఇరువైపుల కూడా హరితహారం పథకంలో భాగంగా అధికారులు తమ లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను నాటారు. విడతల వారీగా మొక్కలు నాటుతున్నప్పటికీ వాటిని పెంచడంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వెరిసి రైతుల అవగాహన లోపం, పట్టింపులేని తనంతో పంట చేన్ల వెంట నాటిన మొక్కలు ఎక్కడికక్కడ ఎండిపోవడమే కాకుండా పెరిగిన మొక్కలను కొంతమంది రైతులు నరికివేయడం, కాల్చివేయడం లాంటి పనులు చేస్తుండడంతో హరితలక్ష్యం నీరుగారిపోతుంది. సరైన ప్రణాళికలు లేకపోవడంతో రోడ్ల వెంట విద్యుత్ తీగల క్రింద నాటిన మొక్కలను సైతం ఏపుగా పెరగగానే విద్యుత్ సమస్యలు తలెత్తుతాయని కొమ్మలు, చెట్లను నరికి వేస్తున్నారు. ఇలా ఏదో ఒక రకంగా చాలా ప్రదేశాల్లో ఏటేటా నాటిన మొక్కలు నిర్వీర్యం కావడంతో హరితహారం పథకం అబాసుపాలవుతుంది.



బోర్లకుంట వద్ద కాలిపోయిన చెట్లు

ప్రత్యేక అధికారులు దృష్టి పెడితేనే...

సర్పంచ్‌ల పదవికాలం ముగిసిపోయింది. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండడంతో వారు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాలకు చెందిన ప్రత్యేక అధికారులు ఆయా గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి హరితహారంలో నాటిన మొక్కలను అగ్గిపాలు కాకుండా ఉండేందుకు రైతులకు అవగాహన కల్పిస్తే తప్పా మొక్కలు ఎదిగే పరిస్థితి కనిపించడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిసారించి మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హైవే పక్కన బస్టాండ్లను నిర్మించాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దినకర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేషనల్ హైవే రహదారి నిర్మాణంలో భాగంగా రెబ్బెన నుంచి వాంకిడి వరకు వివిధ ప్రాంతాల్లో రోడ్డు పక్కన బస్టాండ్ నిర్మించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బస్టాండ్లను నిర్మించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు టీకానందుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెబ్బెన, ఆసిఫాబాద్, వాంకిడి మండలాల మీదుగా నాలుగు వరుసల రహదారి 2019 సంవత్సరంలో మంజూరై 2024లో పూర్తయ్యిందన్నారు. రోడ్డు పూర్తికాకముందే డీబీఎల్ కంపెనీ యాజమాన్యం టోల్ గేట్లు ఏర్పాటు చేసి వాహనదారుల వద్ద నుంచి చలాన్ల రూపంలో దోపిడీ ప్రారంభించిందన్నారు. అయితే రహదారి పక్కన బస్ షెల్టర్లు నిర్మించడం మాత్రం మర్చిపోయారన్నారు. వారికి డబ్బుల మీద ఉన్న శ్రద్ధ ప్రజల మీద లేదని ఆరోపించారు. బస్టాండ్ లేకపోవడంతో చెట్టు నీడ కూడా కరువై హైవే మీద వాహనాల కోసం ఎదురుచూస్తూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తున్న డీబీఎల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, వెంటనే బస్టాండ్‌ల నిర్మాణ ప్రక్రియ ప్రారంభించేలా కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో రహదారిపై ప్రజలని కలుపుకొని ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, చాపిడి పురుషోత్తం, జిల్లా సహాయ కార్యదర్శిలు దుర్గం రాజ్ కుమార్, వడ్లూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి అనవసరంగా రోడ్లపై తిరగరాదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎలాంటి పని లేకుండా అర్ధరాత్రి అనవసరంగా రోడ్లపై తిరగకూడదని డీఎస్పీ సదయ్య హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో శనివారం అర్ధరాత్రి 'ఆపరేషన్ చెప్పుత్రా' నిర్వహించి 75 మందిని అదుపులోకి తీసుకొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా జిల్లా కేంద్రంలో మద్యం మత్తులో రాత్రిపూట వేకిలి చేష్టలు చేస్తూ తిరగకుండా ఆపరేషన్ చెప్పుత్రా నిర్వహించమన్నారు. ఇందులో భాగంగా అర్ధరాత్రి దాటిన తర్వాత రోడ్లపై బైక్‌లపై తిరుగుతూ అసాంఘిక చర్యలకు పాల్పడుతున్న యువతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. సుమారు 75 మంది యువకులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఎవరూ కూడా అకారణంగా రోడ్లపైన తిరగవద్దని ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ కూడా అమలులో ఉందని ఏదైనా మెడికల్ ఎమర్జెన్సీ తప్ప మిగతా సందర్భాలలో యువకులు రోడ్ల మీదకు వచ్చుకుంటూ రోమింగ్ చేయవద్దని, అదేవిధంగా చాలామంది యువకులు నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను స్పీడ్‌గా డ్రైవ్ చేస్తున్నారన్నారన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి వారందరినీ అడ్డుకట్ట వేయడానికి ఈ ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇటువంటివి కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో అసిస్టెంట్ కమాండెంట్ సీఆర్పీఎఫ్ రాకేష్, ఆసిఫాబాద్ పట్టణ సీఐ సతీష్, రెబ్బెన సీఐ బుచ్చిబాబు, వాంకిడి సీఐ శ్రీనివాస్, ఆసిఫాబాద్ పట్టణ ఎస్సైలు రాజేశ్వర్, ప్రవీణ్, వాంకిడి, కెరమెరి, రెబ్బెన ఎస్సైలు సాగర్, ఎస్సై చంద్రశేఖర్, సీఆర్పీఎఫ్ బలగాలు, స్పెషల్ పార్టీ ఫోర్స్, సివిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ సదయ్య

బీజేపీతో ఆర్థిక పరిపుష్టి సాధ్యం : నగేష్



బీజేపీలో చేరిన వారితో ఎంపీ అభ్యర్థి నగేష్, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పాలనలో దేశం ఆర్థిక పరిపుష్టి సాధించిందని రానున్న రోజుల్లో ఇది మరింత అభివృద్ధి చెందుతుందని అదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. ప్రచారంలో భాగంగా జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరిగెల నాగేశ్వరరావు చేరికతో పార్టీ మరింత బలంగా మారిందని, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో భారీ మెజారిటీ ఖాయమైందని తెలిపారు. భారతీయ జనతా పార్టీలో విలువలతో కూడి, నిజాయితీ గల నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలున్నారని, ఆ కార్యకర్తల అకుంఠిత దీక్షతో కూడిన కృషితో భారీ మెజారిటీతో గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఆసిఫాబాద్ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులతో పలు జాతీయ రహదారులు, నాలుగు వరుసల జాతీయ రహదారులు నిర్మాణం చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఎంపీగా గెలిచిననంతరం గుడిహత్నూర్ నుండి ఆసిఫాబాద్ వరకు గల రహదారిని జాతీయ రహదారిగా మార్చి రోడ్డు విస్తారణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు మాట్లాడుతూ అపార అనుభవం కలిగి ఉండి 30 ఏండ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చలేని నాయకుడైన గోడం నగేష్‌ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అంతకు ముందు పలువురు యువకులు బీజేపీ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్, ఆసిఫాబాద్ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, పార్టీ జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మి నరసింహం మాట్లాడుతూ ఓపెన్ యూనివర్సిటీ రెగ్యులర్‌గా చదువుకోలేని విద్యార్థులు, ఉద్యోగస్తులకు వరం లాంటిదని తెలిపారు. విద్యార్థులకు ఓపెన్ యూనివర్సిటీ ప్రాధాన్యం, విద్యార్థులకు చేస్తున్న సేవలను వివరించారు. కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ మాట్లాడుతూ ఓపెన్ యూనివర్సిటీ క్లాసులు, ఎగ్జామినేషన్ ఫీజ్, సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ క్లాసులు తదితర విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టడీ సెంటర్ లెక్చరర్స్ యాకూబ్, తిరుమల, వెంకటేశ్వర్లు, మాణిక్ రావు, నాన్ టీచింగ్ సిబ్బంది సత్యనారాయణ, భాస్కర్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఐదుగురు విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని బీబ్రా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంబాల జయేందర్ తెలిపారు. అలాగే ఇటీవల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి పోటీ పరీక్షలు నిర్వహించగా పరీక్షలో బీబ్రా గ్రామానికి చెందిన దుర్గం హారిక, దుర్గం సింధు, దుర్గం రోహిత్, దుర్గం విద్యాసాగర్, శిధర్త్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారన్నారు. పాఠశాల నుంచి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రణీత, స్రవంతి, గ్రామస్తులు అభినందించారు.

సింగరేణిలో 138వ మేడేను జయప్రదం చేయాలి

- ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు ఉపేందర్



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణిలోని మైన్స్‌లో 138వ మేడేను ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగె ఉపేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే వాల్‌పోస్టర్లను గోలేటీ పీహెచ్‌సీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా బోగె ఉపేందర్ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కార్మిక చట్టాల పునరుద్ధరణకై దేశంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలన్నారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజలను రక్షించుకోవడానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. అలాగే సింగరేణిలో రోజురోజుకు పెరుగుతున్న ఎండతీవ్రత ఎక్కువగా ఉందని, కార్మికుల పని వేళలను వెంటనే మార్చాలని యాజమాన్యాన్ని కోరారు. ఉత్పత్తి సాధించిన కార్మికులకు సొంతంటి పథకాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్మిక పిల్లలకు సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రారంభించాలని, సింగరేణిలో లాభాల వాటాను ప్రకటించాలని, కాంట్రాక్టు కార్మికులకు జీఓ నెంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఖాళీగా ఉన్న క్వార్టర్లను కాంట్రాక్టు కార్మికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో సమ్మె చేసినప్పుడు చేసిన ఒప్పందాన్ని వెంటనే అమలుచేయాలన్నారు. అమెరికా మార్కెట్‌లో 1886 మే ఒకటిన సమ్మె చేయాలని నిర్ణయించిన ప్రపంచ కార్మికుల సమాఖ్య సోషలిస్టు, కార్మిక సంఘాల సమ్మె నిరసన ప్రదర్శన ఎనిమిది గంటల పని దినం కోసం కదం తొక్కిన కార్మికులపై పెట్టుబడిదారులు, పోలీసులు జరిపిన కాల్పుల్లో చనిపోయిన వారి రక్తం తడిసి ఎగరేసిన ఎర్ర జెండే మేడే అని అన్నారు. 75 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశంలో పౌర ప్రజాస్వామ్య పాలన అంతమైందని, పెట్టుబడిదారి విధానం కొనసాగుతుందని, కార్మిక వర్గం దశాబ్దాలు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలు, 29 చట్టాలను సమూలంగా రద్దు చేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు కోడ్‌లను తెచ్చిందన్నారు. హమాలీ, ఆటో, ట్రాన్స్‌ఫోర్ట్ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తేవాలని, భవన నిర్మాణ కార్మికుల మరణానికి రూ.10 లక్షలు చెల్లించాలని, రూ.ఐదు వేల పెన్షన్ ఇవ్వాలని, సింగరేణి కాంట్రాక్టు కార్మికులు, ఆఫీసులో పనిచేస్తున్న ప్రయివేటు బస్సు డ్రైవర్లను పర్మినెంట్ చేయాలని, సింగరేణిలో గుర్తింపు పత్రం ఇవ్వాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఆర్టీసీ ఉద్యోగుల సీసీఎస్ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, మధ్యాహ్నభోజన కార్మికులకు కనీసం రూ.26 వేల వేతనం చెల్లించాలన్నారు. గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ విధానాన్ని సవరించి పెండింగ్ ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని, అన్ని రకాల కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉపాధిహామీ కార్మికులు 200 రోజుల పని దినాలు కల్పించి రోజుకు రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని కార్మికులు, కర్షకులు అందరు కలిసి మేడే ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కోల్‌ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ అధ్యక్షుడు అరికిల్ల స్వామి, నాయకులు ఎం సతీష్, కృష్ణ, సంతోష్, వేముర్ల స్వామి, రాజు పాల్గొన్నారు.

సంతలో బీఆర్ఎస్ ప్రచారం



నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని వారసంతలో ఆదివారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండె విఠల్ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ తమకు ఓటు వేయాలని, ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను కోరారు. తనను ఎంపీగా గెలిపిస్తే జిల్లాను అభివృద్ధి చేస్తామని, తెలంగాణ సాధించడంలో కీలకపాత్ర పోషించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషిని మరువద్దని కోరారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి తనను ప్రజలు గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు సామల రాజన్న, షెమీయొద్దిన్ ఉన్నారు.

శాంతియుత వాతావరణానికి ప్రజలు సహకరించాలి

- కాగజనగర్ డీఎస్పీ కరుణాకర్

నవతెలంగాణ-దహెగాం

శాంతియుత వాతావరణానికి ప్రజలు సహకరించాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎన్నికల నేపథ్యంలో కేంద్ర, సివిల్ పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు అందరూ సహకరించాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎలాంటి వర్గ బేధాలు లేకుండా అల్లర్లు జరుగకుండా సహకరించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ సూచన ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇప్పటి నుండే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సాధించడం జరిగిందన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలోని ప్రజలంతా ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉన్నప్పుడే గ్రామం, జిల్లా అభివృద్ధి చెందుతుందని, ప్రజలంతా వర్గ బేధాలు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు, దహెగాం ఎస్సై కందూరి రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీని గెలిపిస్తే మండల అభివృద్ధి

నవతెలంగాణ-వాంకిడి

బీజేపీని గెలిపిస్తే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆదిలాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. ఆదివారం మాజీ ఎంపీపీ దుర్గం ఆర్థిక ఆయన సమపక్షంలో ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. గొడం నాగేష్‌ను గెలిపించడానికి అందరు సహకరించాలని కోరారు.

కొడుకుపై బెంగతో తల్లి ఆత్మహత్య

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



కొడుకుపై బెంగతో తల్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక శాంతినగర్‌కు చెందిన ఆడెపు అనిత(40) చాలా రోజులుగా హైదరాబాదులో ఉంటున్న తన కుమారుని ఇంటికి రమ్మని పిలిచినా రాకపోవడంతో కుమారునిపై బెంగ పెట్టుకుంది. డ్వాక్రా మహిళ సంఘం గ్రూపు డబ్బులు కట్టవలసి ఉండగా బాధపడుతూ ఉండేది. మనోవేదనకురైన మహిళ శనివారం రాత్రి 7.30 గంటలకు ఇంటి వెనుకాల ఉన్న చెట్టుకి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నీటి ట్యాంకులను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని పోన్కల్ గ్రామంలోని మిషన్ భగీరథ నీటి ట్యాంకులను ఆదివారం ఆర్డబ్ల్యూఎస్ ఈఈ వెంకటేశ్, ఏఈ అబ్రహం పరిశీలించారు. పోన్కల్ గ్రామంలోని మిషన్ భగీరథ నీటి ట్యాంకులను పరిశీలించి సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని స్థానిక అధికారులను ఆదేశించారు. వారితో పాటు పోన్కల్ ఈఓ రాహుల్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ పలువురి చేరిక

నవతెలంగాణ-జన్నారం



కవ్వాల్ గ్రామపంచాయతీకి చెందిన బీజేపీ గిరిజన నాయకుడు లకావత్ సక్రు నాయక్ తన అనుచరులతో కలిసి ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిలాబాద్ ఎంపీగా ఆత్రం సుగుణ గెలుపునకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం యూత్ కాంగ్రెస్ నాయకులు ఆకుల రాకేష్ గౌడ్, రోహిదాస్ పాల్గొన్నారు.

నేటి సదస్సును జయప్రదం చేయాలి

నవతెలంగాణ-జైపూర్

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి మాదిగ-నేతకాని ఆత్మీయ సమ్మేళనం సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రామగిరి రాము మాదిగ కోరారు. సోమవారం ఏర్పాటు చేసిన ఈ సందస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలో గల మాదిగలు, నేతకాని కులస్తులు అత్యధిక సంఖ్య హాజరు కావాలని కోరారు.

ఘనంగా శ్రీరాముని రథోత్సవం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని గోదావరి ఒడ్డున వెలసిన శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి సీతారాముల రథోత్సవం ఆదివారం సాయంత్రం ఆలయ నిర్వాహకులు, పూజారులు ఘనంగా నిర్వహించారు. సీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామ నవమి నుంచి ఐదు రోజులపాటు రామునికి ప్రత్యేక పూజలు చేసి, ఐదవ రోజు సందర్భంగా రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, కమ్మల భూమయ్య గంగయ్య కమ్మల విజయ ధర్మ, ఎంపీటీసీ దర్మనాల వెంకటస్వామి మాజీ సర్పంచ్ జాడి గంగాధర్, యుగంధర్, రవి గంగాధర్, శంకర్, ఆలయ పూజారులు, ఆంజనేయ స్వామి భక్తులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సంఘ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో కార్యదర్శి ఎం శివప్రసాద్ నివేదికను చదివి వినిపించారు. సంఘం తరఫున చేసిన సంక్షేమ కార్యక్రమాలు ఇతర కార్యక్రమాలు, జమఖర్చుల వివరాలను తెలియజేశారు. సభ్యులందరు నివేదికపై సభ్యులు ఆమోదం తెలిపారు. సభ్యత నమోదు, సంఘ భవనంపై అంతస్తు నిర్మాణంపై చర్చించారు. ఈహెచ్‌ఎస్ నగదు రహిత వైద్య సేవలు అందించాలని, విశ్రాంత ఉద్యోగులకు రావల్సిన నాలుగు డీఏలను వెంటనే ప్రభుత్వం మంజూరు చేయాలని, ఈ మధ్యకాలంలో రిటైర్మెంట్ అయిన ఉద్యోగుల చెల్లింపులను వెంటనే చెల్లించాలని తీర్మాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం జయదేవ్, బాధ్యులు మురళీధర్ రావు, మాజీ రాష్ట్ర కార్యదర్శి టీ. నర్సింగరావు పాల్గొన్నారు.

జోరుగా కొనసాగుతున్న బీజేపీ ప్రచారం

నవతెలంగాణ-నార్నూర్

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గాదిగూడ మండలంలో బీజేపీ అభ్యర్థి తరుపున నాయకులు ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. ప్రచారంలో భాగంగా జెడ్పీటీసీ గంగుబాయి, సోము మండలంలోని రాంపూర్, ఖాండవ్, మతురా తండా, ఆర్మీయాన్ తదితర గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని మళ్లీ ప్రధానమంత్రిగా చేయాలంటే ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇందులో మండల అధ్యక్షులు శివాజీ, నాయకులు మేస్రం వెంకటేష్, ఆత్రం నాగోరావ్, మారుతి, జాకు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ హాయంలోనే దేశం పురోగతి

నవతెలంగాణ-భైంసా

ప్రధాని మోడీ హయంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని బీజేపీ నాయకులు అన్నారు. మండలంలోని దేగాం గ్రామంలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించి వారు మాట్లాడారు. ఎంపీ అభ్యర్థి గడ్డం నగేష్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ నాయకత్వంలో గ్రామాన్ని అభివృద్ధి పరుస్తామని, అధికార పార్టీ నాయకులు బెదిరింపులకు పాల్పడితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అబ్దుల్ రజాక్, జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్, నాయకులు పండిత్ రావు పటేల్, మండల మోర్చా మహిళా అధ్యక్షురాలు సిరం సుష్మా రెడ్డి, కిష్టన్న, చంద్రకాంత్ పటేల్, మాజీ ఉప సర్పంచ్ ఎల్లప్ప, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు నందకుమార్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని సిరిపెల్లి అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద ఆదివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. స్వర్ణ గ్రామానికి చెందిన అబ్దుల్ అబిద్ టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై రెండున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రలోని షివినికి తరలిస్తున్నారు. బియ్యం, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ తరలించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై వసంత్, హెడ్ కానిస్టేబుళ్ల రాములు, లింగారామ్, కానిస్టేబుల్ మనోజ్ ఉన్నారు.

పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి మార్పు..?

- పునరాలోచనలో పార్టీ అధిష్టానం
- సందిగ్ధంలో స్థానిక నాయకులు
- తెరపైకి మాజీ ఎంపీ, లిరిక్ రైటర్







నవతెలంగాణ-మంచిర్యాల

గత కొన్ని రోజులుగా బీజేపీ పెద్దపెల్లి ఎంపీ అభ్యర్థిని మార్చే అవకాశం ఉందంటూ వచ్చే వార్తలతో నియోజకవర్గ బీజేపీ క్యాడర్ అయోమయంలో ఉన్నట్లు తెలుస్తోంది. అభ్యర్థి మార్పు విషయంలో అధిష్టానం పునరాలోచిస్తున్నట్లు తెలియడంతో నాయకులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సైతం అంతర్మదనంలో పడ్డారు. ఎవరికీ వారే అభ్యర్థి పరంగ కాకుండా పార్టీ పరంగ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో పెద్దపెల్లి పార్లమెంట్ అభ్యర్థి ఫైనల్ ఎవరవుతారా అన్న విషయంలో స్థానిక నాయకులు అయోమయంలో ఉన్నారు. పెద్దపెల్లి పార్లమెంట్ నియోజక వర్గం మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాలను కలుపుకొని ఉంది. పెద్దపెల్లి, మంథని, రామగుండం, ధర్మపురి, చెన్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి ఏడూ నియోజక వర్గాలను కలుపుకోని ఉన్న పెద్దపెల్లి పార్లమెంట్ నియోజకవర్గంపై బీజేపీ అధిష్టానం ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన ఎంపీ టికెట్ దక్కించుకున్న గోమాస శ్రీనివాస్‌పై అధిష్టానం కాస్త అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. గోమాస సీనియర్‌లను కలుపుకు పోవడం లేదని, నియోజకవర్గంలో ప్రచారం చేయడం లేదని, స్థానిక బీజేపీ నాయకులు అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ నుండి బలమైన అభ్యర్థులు ఉండగా బీజేపీ అభ్యర్థి వారికి గట్టి పోటీ ఇవ్వలేక పోతాడని బీజేపీ అధిష్టానం భావిస్తోందని ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో ప్రధాన మైన సింగరేణి ఓటర్లపై గోమాస శ్రీనివాస్ దృష్టి సారించలేదని తెలుస్తోంది. కేవలం మంచిర్యాల, బెల్లంపల్లి నియోజక వర్గాల్లోనే ప్రచారం చేస్తూ మిగిలిన నియోజకవర్గాలవైపు కన్నెత్తి చూడడం లేదన్నా విమర్శలు ఉన్నాయి. గత పది రోజుల క్రితం గోమాస తన ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఒక్కటి నియోజకవర్గంలో సంచలనమే రేపింది. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ తన కొడుకు గడ్డం వంశీని పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా భరిలో నిలిపి తనను గెలిపించాలని ధీమాతో బీజేపీ పెద్దపెల్లి పార్లమెంట్ అభ్యర్థిగా నన్ను మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని గోమాస మాట్లాడిన మాటలు నియోజకవర్గంలో ఆసక్తిగా మారాయి. ఇప్పటికి వివేక్ బీజేపీ ముఖ్య నేతలతో టచ్‌లో ఉన్నాడని అందుకే తన కొడుకు గెలుపుకు అడ్డుగా ఉన్న నన్ను మార్పించాలనే ప్రయత్నం వివేక్ బీజేపీ హైకమాండ్‌తో కలిసి చేస్తున్నారని పలు విమర్శలు చేశారు. దానికి తోడు లోకల్ లీడర్‌లు సైతం పెద్దపెల్లి పార్లమెంట్ అభ్యర్థిని మార్చాలని పార్టీ అధిష్టానానికి తెలిపినట్లు సమాచారం. ఈ సరి జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లిలో బీజేపీ గెలుపుపై ఫోకస్ చేసిన అధిష్టానం అభ్యర్థి మార్పు విషయంలో పున:రాలోచనలో పడ్డట్లు తెలుస్తుంది.

తెరపైకి మాజీ ఎంపీ, లిరిక్ రైటర్

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరి 2018లో టిక్కెట్ దక్కించుకొని ఎంపీగా గెలుపొందిన వెంకటేష్ నేత ఈ మధ్య తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ లో ఉంటె మళ్లి టిక్కెట్ రాదేమో అన్న ఆలోచనతో కాంగ్రెస్‌లో చేరిన వెంకటేష్ నేతకు కాంగ్రెస్ షాక్ ఇచ్చింది. టిక్కెట్ వెంకటేష్ నేతకు కాకుండా వివేక్ కొడుకు గడ్డం వంశీకి ప్రకటించింది. దీనితో వెంకటేష్ నేత పార్టీ మారె ఆలోచనలో పడ్డట్లు తెలుస్తోంది. టిక్కెట్‌పై హామీ ఇస్తే బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు అతని అనుచరులు చెప్తున్నారు. గతంలో ఎంపీగా ఉన్న సమయంలో వెంకటేష్ నేత నియోజక వర్గంలో తన దైన ముద్ర వేసుకోవడంలో విఫలం అయ్యారని, ప్రజల్లో వెంకటేష్ నేతకు ఆదరణ లేదని, బీజేపీ నుంచి టిక్కెట్ ప్రకటిస్తే గెలుపు కష్టం అవుతుందేమో అని అధిష్టానం బావిస్తున్నట్లు సమాచారం. అందుకు మరొక నేత సైతం పెద్దపల్లి పార్లమెంట్ టిక్కెట్‌పై ఆశతో అధిష్టానంతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. పాటల రచయితగా మంచి పేరు తెచ్చుకున్న మిట్టపెల్లి సురేందర్ సైతం బీజేపీ పెద్దపల్లి ఎంపీ టిక్కెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తుంది. గతం లోను టికెట్ అభ్యర్థించి బంగ పడ్డ సురేందర్ ఇటీవల అభ్యర్థి మార్పు జరుగుతుందన్న సమాచారంతో తిరిగి అధిష్టానం పెద్దలతో టచ్‌లో ఉన్నాడని తెలిసింది. బీజేపీ పార్టీతో 2009 నుండి దగ్గరి సంబంధాలు కొనసాగిస్తున్న సురేందర్, పరకాల బై ఎలక్షన్స్, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద కిషన్‌రెడ్డి అధ్వర్యంలో జరిగిన దీక్ష దివస్‌లో ముఖ్య పాత్ర పోషించారు. తెలంగాణ ఉద్యమంలోను మిట్టపెల్లి సురేందర్ తన దైన శైలీలో పని చేశారు. నియోజకవర్గంలోను సురేందర్‌కు పట్టుంది. సింగరేణి ప్రాంతంపై అవగాహన ఉంది. తన కుటుంబ సభ్యుల్లోనూ గౌడ్, పెరక, కాపు సామాజిక వర్గాలు ఉండడంతో సురేందర్‌కు నియోజకవర్గం కలిసొచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. మొత్తానికి పార్టీ అభ్యర్థిని ఫైనల్‌గా ఖరారు చేస్తారా లేక అదే అభ్యర్థిని కొనసాగిస్తారా అన్న డైలమాలో బీజేపీ శ్రేణులు ఉన్నారు.

కార్మికులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయాలి

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గత ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిందని దానికి అభినందనలు తెలుపుతూ కార్మికులకు ప్రోత్సాహక బహుమతులు వెండి, బంగారు నాణాలు ఇవ్వాలని సింగరేణి కాలరీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నస్పూర్ కాలనిలోని సింగరేణి గార్డెన్స్‌లో యూనియన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులలో ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం ద్వారా పోటీ తత్వం పెరిగి, గైర్హాజర్ శాతం తగ్గుతుందన్నారు. కోల్ ఇండియాలో వలె కార్మికులకు కూడా పెర్క్స్ పై ఆదాయ పన్ను రద్దు చేయాలని అన్నారు. కార్మికులకు సొంతింటి పథకం కింద 200 గజాలు అందజేయాలన్నారు. కొత్త గనుల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. అండర్ గ్రౌండ్‌లో ఎస్‌డీఎల్ యంత్రాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, కొత్తవి కొనుగోలు చేయాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ఎస్డిఎల్, రక్షణ పరికరాలు అందించాలని యాజమాన్యాన్ని కోరారు. పార్లమెంట్ ఎలక్షన్లను అడ్డుగా పెట్టి విధిగా ఇవ్వవలసిన ప్రమోషన్లను ఇవ్వకపోవడం సరికాదని అన్నారు. కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వడం అనేది ఎన్నికలకు సంబంధం లేదని అన్నారు. ఎప్పుడు లేని విధంగా సింగరేణి అధికారులను ఎన్నికల విధులకు ఉపయోగించుకుంటూ ప్రత్యేక సెలవుల పేరుతో కంపెనీకి నష్టం కలిగిస్తున్నారని తెలిపారు. డిసెంబర్‌లో సింగరేణి ఎన్నికలు జరిగినప్పటికీ గుర్తింపు పత్రం ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. టీబీజీకేఎస్ గెలిచినప్పుడు తొమ్మిది నెలల తర్వాత ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే గుర్తింపు పత్రం ఇచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన కార్యదర్శులు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఏరియా బ్రాంచ్ సెక్రటరీ ఎస్కే బాజీ సైదా, నాయకులు ప్రసాద్‌రెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యూత్ బాక్సింగ్ సెలక్షన్స్



నవతెలంగాణ-నస్పూర్

సీసీసీ కార్నర్‌లోని కుమార్ గన్నర్స్ అకాడమీలో జిల్లా స్థాయి యూత్ మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ సెలక్షన్స్ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుమార్ గన్నర్స్ అకాడమీ ఫౌండర్, ఆర్మీ రిటైర్డ్ అధికారి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల పట్ల యువత ఆసక్తి చూపాలని జిల్లా రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయిలో బాక్సింగ్ క్రీడలో ప్రతిభ కనబరిచి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు 26వ తేదీ నుండి 28వ తేదీ వరకు జరగబోయే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బోయిని రాజ్ కుమార్ అభినందించారు. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పాదం రవీందర్, సీనియర్ క్రీడాకారులు కొట్టే దేవేందర్ కోచ్ రాజేష్, మహేష్, జగత్ సాయి కుమార్, గన్నర్ అకాడమీ ఇన్‌చార్జి రమేష్ పాల్గొన్నారు.

24న చేనేని భీమయ్య వర్ధంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కాసిపేట

ఆదివాసీ ఉద్యమ పోరాటయోధుడు, అమరుడు చేనేని భీమయ్య 36వ వర్ధంతిని ఈ నెల 24న మండలంలోని మద్దిమాడలో నిర్వహిస్తున్నామని, ఆదివాసీ గిరిజనులు భారీగా తరలివచ్చి వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఈ మేరకు మద్ది మాడ గ్రామంలో వర్ధంతి నిర్వహణ సమావేశం నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా చేనేని భీమయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివాసీ సంప్రదాయ పద్దతిలో నిర్వహించడం జరుగుతుందని, మండలంలోని అన్ని ఆదివాసీ, గిరిజన సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్‌లు రొడ్డ రమేష్, ఆడె జంగు, ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల భాపన్న, తుడుందెబ్బ మండల అధ్యక్షులు సంద్ర భుమన్న, ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం మండల అధ్యక్షులు బద్ది శ్రీనివాస్, ఉపాధ్యక్షులు భీమిని మహేందర్, సాంస్కృతిక కార్యదర్శి రెడ్డి లక్ష్మణ్ పాల్గొన్నారు.




కాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని గణేష్ నగర్‌లో నివాసం ఉంటున్న క్యాన్సర్ బాధితురాలు శివార్ల సాయమ్మకు ఆదివారం ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. గత రెండు సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ కదలలేని పరిస్థితిలో ఉందని, వారి ఆర్థిక పరిస్థితి బాగోలేక వైద్యం చేపించుకోవడానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారని విషయం తెలుసుకున్న ట్రస్ట్ సభ్యులు వారిని పరామర్శించి రూ.10,000 చెక్ రూపంలో అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ ఇంకా ఎవరైన దాతలు ఉంటే ముందుకు వచ్చి సాయమ్మకు చికిత్స కోసం స్పందించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బి లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులు బి.భూమేష్, ఉపాధ్యక్షుడు ఏ.కుమార్, కోశాధికారి టీ.సురేష్, ప్రచార కార్యదర్శి శరత్ బాబు పాల్గొన్నారు.

బోర్వెల్ ప్లాట్ ఫామ్ నిర్మించుకున్న గ్రామస్తులు



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ పంచాయతీలోని అచ్యుత్ రావు గూడెంలో తాగు నీరు బోర్వెల్ ప్లాట్‌ఫామ్‌ను గ్రామస్తులు నిర్మించుకున్నారు. గ్రామంలోని బోర్వెల్ ప్లాట్ ఫామ్ పూర్తిగా ధ్వంసం కాగా మరమ్మత్తులు చేపట్టాలని కార్యదర్శి, అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని, బోర్ వెల్ ప్లాట్ ఫామ్ మొత్తం చెడిపోయి చుట్టూ నీళ్ల నిలిచి దుమ్ము పడి నీళు కలుషితం అవుతుందని, అనారోగ్యాలకు గురవుతున్నామని చెప్పినా ట్టించుకోలేదన్నారు. దింతో ఎవరూ పట్టించుకోకపోవడంతో గ్రామస్తులమంతా కలిసి ప్లాట్ ఫాం నిర్మించుకున్నామని గ్రామస్తులు తెలిపారు.

మార్కండేయ ఆలయంలో నవగ్రహాల ప్రతిష్టాపన

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ఫోన్కల్ గ్రామపంచాయతీ పరిధిలోని శివాలయం ప్రాంతంలో మార్కండేయ స్వామి ఆలయంలో ఆదివారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నవగ్రహాల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడు శెట్టిపల్లి గంగయ్య ఆధ్వర్యంలో, ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్టాపన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సత్తుపల్లి సత్యం వాసాల నరేష్, వాసాల శ్రీనివాస్, సారంగపాణి, వీరయ్య, నరేష్, కృష్ణ పాల్గొన్నారు.

వెల్డర్లకు అవకాశం కల్పించాలని మంత్రికి వినతి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి ఎక్స్‌టర్నల్ ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఐటిఐ వెల్డర్లకు అన్యాయం జరిగిందని, వెల్డర్లకు కూడా అవకాశం కల్పించాలని శ్రీరాంపూర్ ఏరియా నిరుద్యోగులు ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు ఆదివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటిఐ వెల్డర్ చేసి సింగరేణి ఉద్యోగ అవకాశం కోసం ఎదురుచూస్తున్న మాకు నిరాశే ఎదురైందని, ఇప్పటికైనా వారికి అవకాశం కల్పించి న్యాయం చేయాలని కోరారు.

వివాహానికి కాంగ్రెస్ నాయకుల చేయూత

నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలం మద్దికంటి గ్రామంలో గల నిరుపేద కుటుంబంలో జరుగుతున్న వివాహానికి మండల కాంగ్రెస్ నాయకులు చేయుతనందించారు. పేద కుటుంబానికి చెందిన సుందిళ్ల మాళవిక వివాహజం ఆదివారం జరుగుతున్నట్లు తెల్సుకున్న కాంగ్రెస్ నాయకులు భుక్య లక్ష్మన్ 75 కిలోల బియ్యం, వేల్పుల శ్రీనివాస్ 25 కిలోలు, భీమారం సోషల్ మీడియా కోఆర్డినేటర్ షడంశెట్టి రమేష్ 25 కిలోల చొప్పున బియ్యం అందజేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొత్తపల్లి మోహన్‌రెడ్డి, పోతం సమ్మయ్యలు చికెన్ సమకూర్చినట్లు తెలిపారు. పేద కుటుంబంలో జరుగుతున్న పెండ్లికి ఆర్థికంగా తోడ్పాటు అందివ్వడానికి తమ వంతుగా సహకరించినట్లు నాయకులు తెలిపారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని చింతలపల్లే గ్రామ శివరులో ఆర్ అండ్ బీ రోడ్డుకు అనుకొని ఉన్న వ్యవసాయ బావి ప్రమాదకరంగా మారింది. ఇదే రోడ్డుపై నుండి ప్రతి రోజు ఆటోలు, ద్విచక్రవాహనాల ద్వారా చింతలపల్లే గ్రామ ప్రజలు జన్నారం మండల కేంద్రంకు రాకపోకలు సాగిస్తారు. రోడ్డుకు అనుకొని ఉండటం వల్ల ప్రమాదం జరిగే ఆవకాశముందని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. సంబందిత అధికారులు రోడ్డుకు అనుకొని ఉన్న బావి గురించి పట్టించుకోవటం లేదని విమర్శిస్తున్నారు. ఎలాంటి ప్రమాదలు జరగకముందే బావిని పూడ్చి వేయాలని కోరుతున్నారు.